ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3 పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

ఆదివారం 14 జూలై 2024



శివారు భూములకూ నీరు

- సరఫరాకు ఆదేశించిన కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి
- ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తోటపల్లి సమస్యలు
- లస్కర్ల నియామకానికి చర్యలు
- ఎడమ ప్రధాన కాలువ నుంచి సాగునీరు విడుదల



ఎడమ ప్రధాన కాలువ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

గరుగుబిల్లి, జూలై 13 : తోటపల్లి ప్రాజెక్టు నుంచి పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని శివారు భూములకూ సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశించారు. శనివారం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ, కుడి కాలువ నుంచి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. లస్కర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాత రెగ్యులేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలను నివేదిక రూపంలో అందించాలన్నారు. ' గత వైసీపీ ప్రభుత్వం తోటపల్లిని పూర్తిగా విస్మరించింది. మూడు జిల్లాల పరిధిలో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొనేలా చేసింది.. 2018లో టీడీపీ ప్రభుత్వం ఆధునికీకరణ పనులకు రూ.193 కోట్లు మంజూరు చేస్తే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేవలం 22 శాతం మేరే పనులు నిర్వహించింది. సకాలంలో బిల్లుల చెల్లింపులు చేయపోవడంతో పనులన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్ల పాటు రైతులు భారీగా నష్టపోయారు. ఈ ఏడాది వారికి కష్టాలు ఉండవు. ఖరీఫ్, రబీ పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.' అని ఆమె తెలిపారు.

నిధులు లేకే..

' నిధులు సమస్య కారణంగానే ఆధునికీకరణ పనుల్లో జాప్యం నెలకొంది.. ఎడమ కాలువ 37 కిలో మీటర్లకు గాను 17 కిలో మీటర్లు, కుడి కాలువ 17 కిలో మీటర్లకు గాను 4.7 కిలో మీటర్ల మేర లైనింగ్ పనులు జరిగాయి. రెండు కాలువలకు సంబంధించి కాలువల పర్యవేక్షణకు 30 మంది లస్కర్లు ఉండగా, కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేయక ముందే గండ్లు, పూడికతీతలు, పిచ్చి మొక్కలు తొలగింపునకు అవసరమైన ప్రతిపాదనలు చేశాం. ప్రస్తుత ఖరీఫ్‌కు రెండు కాలువల ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నాం.' అని పాలకొండ డివిజన్ డీఈఈ డి.రవి కుమార్ తెలిపారు. అనధికారికంగా మరో 20 వేల ఎకరాలకు పైగా నీరు అందుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న దృష్ట్యా 100 క్యూసెక్కులను కిందకు విడుదల చేశామని తెలిపారు. రెండు కాలువల పరిధిలో గండ్లు నెలకొనకుండా ముందస్తు చర్యలు చేపట్టను న్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు కె.రాజేష్‌కుమార్, బి.శంకరరావు, వి.గౌరునాయుడు, టి.సత్యనారాయణ, టీడీపీ నేతలు ఎ.మధుసూదనరావు, పురుషోత్తంనాయుడు, సత్యనారాయణ, భరత్‌కుమార్, ఎ.రాంబాబు, విజయవాంకుశం, రైతులు పాల్గొన్నారు.

మొరాయించిన షట్టర్లు

గత కొన్నాళ్లుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ షట్టర్లు మొరాయించాయి. తుప్పు పట్టడంతో కదల్లేని విధంగా తయారయ్యాయి. అక్కడే ఉన్న లష్కర్లు స్పందించి కొంచెం గట్టిగా షట్టర్లను తిప్పి సాగునీరు విడుదలయ్యేలా చేశారు. ఇదిలా ఉండగా హెడ్, సైడ్ స్లూయిస్‌ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. మరోవైపు కోతకు గురైనప్రధాన కాలువలపైనా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



సాగునీటిని విడుదల చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి, అధికారులు

ఐదేళ్లూ ఎక్కడ ఉన్నారు..?

సాగునీటి కాలువల పరిధిలోని రైతుల సమస్యలు తెలుసుకోవాల్సిన అధికారులు గత ఐదేళ్లు ఎక్కడ ఉన్నారని విజయనగరం జిల్లా వంగర మండలానికి చెందిన పలువురు రైతులు ప్రశ్నించారు. డీఈఈ డి.రవికుమార్‌తో పాటు జేఈఈలు కె.రాజేష్, డి.శంకరరావులను నిలదీశారు. 'గత ఐదేళ్లుగా సాగునీరు పూర్తిస్థాయిలో అందించలేదు. కాలువల అభివృద్ధితో పాటు సాగునీటి సమస్యలపై అధికారులు కన్నెత్తి చూడలేదు. కారణాలతోనే కాలయాపన చేశారు. కుడి కాలువ పరిధిలో ఉన్నా.. చుక్క నీరు కూడా శివారుకు వచ్చే దాఖలాలు లేవు. వంగరతో పాటు సీతారాంపురం, కొత్తవలస గ్రామాలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.' అని వారు వాపోయారు. గరుగుబిల్లి మండలానికి సంబంధించి లఖనాపురంలో సైఫూన్ పనులు త్వరితగతిన చేపట్టాలని, సాగునీటి సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని టీడీపీ నేతలు కోరారు. చెల్లింపులు జరగకపోవడంతో పనులు ముందుకు సాగలేదని, నిధుల సమస్య కారణంగానే జాప్యం జరిగిందని అధికారులు తెలిపారు. రానున్న రబీ, ఖరీఫ్ సీజన్లకు ఆటంకం లేకుండా సాగునీరు సరఫరా చేస్తామని వారు చెప్పారు.

నాగావళికి వరద



ఒడిశాతో పాటు ఇతర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలోకి వరద పోటెత్తు తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.35 మీటర్ల మేర నీటి సామర్థ్యం ఉంది. పైనుంచి వెయ్యికి పైగా క్యూసెక్కులు రావడంతో దిగువకు నీటిని మళ్లిస్తున్నారు. సాగునీటి అవసరాల నిమిత్తం కుడి ప్రధాన కాలువతో పాటు ఎడమ, కుడి కాలువల నుంచి కొంతమేర నీరు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, కిషోర్‌కుమార్‌లు తెలిపారు.

సదరం.. హర్షం

- వైకల్య ధ్రువీకరణ నమోదుకు అవకాశం
- ఆదేశాలిచ్చిన టీడీపీ సర్కారు
- జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో పరీక్షలు
- స్లాట్లు బుక్ చేసుకుంటున్న దివ్యాంగులు



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి

పార్వతీపురం రూరల్, జూలై13: వైకల్య ధ్రువీకరణ నమోదుకు టీడీపీ ప్రభుత్వం అవకాశం కల్పించడంతో దివ్యాంగుల నిరీక్షణకు తెరపడింది. పింఛన్ మొత్తం పెంచిన నేపథ్యంలో అత్యధికులు సదరం స్లాట్లు బుక్ చేసుకుంటున్నారు. వైకల్య నిర్ధారణ పత్రాల కోసం అర్హులంతా ఆసుపత్రులకు చేరుకుంటున్నారు. వాస్తవంగా ఈ నెల నాలుగో తేదీ నుంచి సదరం స్లాట్ బుక్ చేసుకోవడానికి నూతన ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలోని దివ్యాంగులు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికే స్లాట్లు బుక్ చేసుకున్నవారు.. నిర్ణయించిన ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ ఆసుప్రతుల్లో సదరం మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, కంటికి సంబంధించిన దివ్యాంగులకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరు నెలల అనంతరం ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతో స్లాట్లు బుక్ చేసుకున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు దివ్యాంగుల పింఛను సొమ్మును రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో గతంలో వైకల్య శాతం తక్కువ వచ్చిన వారంతా మరోసారి సదరం క్యాంపునకు వెళ్తున్నారు. ఏదేమైనా టీడీపీ ప్రభుత్వం సదరం నిర్వహణకు చర్యలు తీసుకోవడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్యాంప్‌లు నిర్వహిస్తున్నాం

జిల్లా కేంద్రంతో పాటు సాలూరు, కురుపాం, పాలకొండ ఆసుపత్రుల్లో దివ్యాంగుల కోసం సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నాం. రద్దీ ఉన్న మాట వాస్తవమే. అయినప్పటికీ దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బం దులు లేకుండా సంబంధిత వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు.

- వాగ్దేవి, ఇన్‌చార్జి డీసీహెచ్‌వో, పార్వతీపురం మన్యం జిల్లా

చెరువు కాదండోయ్..



ఇది వీరఘట్టం జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం. శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఇలా మారింది. ఆ ప్రాంతంలో నిలిచిన వర్షపునీటితో ఆటస్థలం చెరువును తలపించింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కోసారి స్వల్ప వర్షానికి కూడా క్రీడా మైదానం ఇలా మారడంతో విద్యార్థులు ఆటలాడేందుకు వీలు పడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆట స్థలాన్ని మట్టితో నింపి ఎత్తు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

- వీరఘట్టం

సమస్యల వసతి!

- దయనీయ స్థితిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్
- తాగునీరు లేదు.. బాత్‌రూములు పనిచేయవు
- పెచ్చులూడిపోయిన గచ్చులు
- కానరాని లైట్లు, ఫ్యాన్లు
- మరోవైపు పాముల సంచారం
- భయాందోళనలో విద్యార్థులు
- వేరే చోటకు తరలిపోతున్న వైనం
- ఐదేళ్లూ పట్టించుకోని గత వైసీపీ సర్కారు



ఇంటిగ్రేటెడ్ హాస్టల్

(జియ్యమ్మవలస)

జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమస్యలకు నిలయంగా మారింది. దూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చిన వారికి అసౌకర్యాలే వెంటాడుతున్నాయి.. దీంతో ఇక్కడ ఉండడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. గత ఐదేళ్లుగా వైసీపీ సర్కారు దానిపై దృష్టి సారించలేదు. హాస్టల్ నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో ఇక్కడకు వచ్చే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. పదిహేడేళ్ల కిందట అప్పటి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు చొరవతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను నిర్మించారు. మొదట దీనిని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఉపయోగించారు. అప్పట్లో ఇక్కడ 400 మందికిపైగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఉండేవారు. అయితే పదేళ్ల కిందట పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం నిర్మించిన తరువాత ఆ భవనాన్ని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌గా మార్చారు. ప్రస్తుతం ఇక్కడ 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బీసీ విద్యార్థులు, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ చదువుతున్న వారు ఉంటున్నారు. పాలిటెక్నికల్ విద్యార్థులు 11 మంది, ఇంటర్ ఆరుగురు, ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు 43 మంది విద్యార్థులు మొత్తంగా.. 60 మంది వరకు ఇక్కడ ఉంటున్నారు. జీజే కళాశాలలో విద్యా బోధన బాగానే ఉన్నా వసతి గృహంలో చేరేందుకు ఎవరూ ఇష్టపడటం లేదు. కౌన్సిలింగ్‌లో భాగంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు హాస్టల్‌ను చూసి హడలిపోతున్నారు. సరైన వసతులు లేకపోవడంతో తిరిగి వేరే చోటకు వెళ్లిపోతున్నారు. మరికొందరు సమీపంలో రూమ్‌లను అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఫలితంగా గత ఆరేళ్లుగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు దారుణంగా పడిపోయాయి. హాస్టల్‌లో వసతులు సక్రమంగా ఉంటే ప్రవేశాలకు విద్యార్థులు పోటీ పడే వారని పాలిటెక్నిక్ అధ్యాపక బృందం చెబుతోంది. ఈ విషయాన్ని గతంలో జిల్లా కలెక్టర్లకు పలుమార్లు నివేదించినా.. ఫలితం లేకపోయిందని వారు వాపోతున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి కౌన్సిలింగ్‌లో వచ్చి జాయిన్ అయిన వారు తిరిగి వెళ్లిపోతున్నారని అధ్యాపక బృందం ఆందోళన వ్యక్తం చేస్తోంది. జిల్లాలో ఉన్న ఏకైక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌పై నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలని వారితో పాటు విద్యార్థులు కోరుతున్నారు.

ఇవీ సమస్యలు

- ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థులు ఉంటున్న గదుల్లో లైట్లు, ఫ్యాన్లు లేవు. దీంతో రాత్రి వేళల్లో కొవ్వొత్తుల వెలుగులో విద్యార్థులు ఉండాల్సి వస్తోంది.
- గదులు, వరండా ప్రాంతాల్లో గచ్చులు ఊడిపోయి దారుణంగా తయారయ్యాయి.
- తాగునీటి వసతి కూడా లేదు. పక్కన ఉన్న నేలబావి నీరే వంటలకు, తాగడానికి ఉపయోగించాల్సిన పరిస్థితి. ఫలితంగా కొందరు విద్యార్థులు చర్మ వ్యాధులతో బాధపడుతున్నారు.
- టాయిలెట్లు ఉన్నా రన్నింగ్ వాటర్ సదుపాయం లేద. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులందరూ బహిర్భూమికి బయటకు వెళ్లాల్సి వస్తోంది.
- వాష్ రూము ఉన్నా.. దానికి కూడా రన్నింగ్ వాటర్ లేక నిరుపయోగంగా మారింది.
- వసతి గృహంలోకి విష సర్పాలు వస్తుండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.
- హాస్టల్ ప్రాంగణంలో స్థానికులు ఇష్టారాజ్యంగా పశువులను కట్టడమే గాకుండా.. ట్రాక్టర్లు, ఇతరత్రా వాహనాలను అక్కడే ఉంచుతున్నారు.

కలెక్టర్‌కు నివేదించాం

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నెలకొన్న పరిస్థితి వల్ల కౌన్సిలింగ్‌లో ఇక్కడ సీట్లు సంపా దించి జాయిన్ అయిన విద్యార్థులు తిరిగి వెళ్లిపోతున్నారు. సరైన వసతి సౌకర్యం లేక కొన్నేళ్ల నుంచి అడ్మిషన్లు పడిపోతున్నాయి. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించాం.

- నరేష్‌బాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్,
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల,చినమేరంగి



హాస్టల్ గదిలో ఊడిపోయిన గచ్చు ఫ్లోరింగ్

ఎస్పీగా మాధవరెడ్డి

- సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై రాక
- ప్రస్తుత ఎస్పీ విక్రాంత్ పాటిల్ కాకినాడకు..

పార్వతీపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో 2017 బ్యాచ్‌కు చెందిన ఎస్వీ మాధవరెడ్డిని నియమిస్తూ ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు రానున్నారు. త్వరలో జిల్లా మూడో ఎస్పీగా మాధవరెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.



నూతన ఎస్పీ మాధవరెడ్డి

గురుకులాల కో ఆర్డినేటర్ బదిలీ


- ఇన్‌చార్జిగా ఫ్లోరెన్స్ నియామకం

సాలూరు రూరల్, జూలై 13: బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ టి.పద్మజ బదిలీపై చిత్తూరు వెళ్లారు. ఆమె స్థానంలో వేపాడ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

పార్ట్‌టైం గెస్ట్ టీచర్ల భర్తీకి 18న ఇంటర్వ్యూలు

ఉమ్మడి జిల్లాలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పార్ట్‌టైం గెస్ట్ టీచర్ల భర్తీ కోసం ఈ నెల 18న నెల్లిమర్ల గురుకులంలో ఇంటర్వ్యూలు, డెమో నిర్వహించనున్నట్టు కో ఆర్డినేటర్ ఫ్లోరెన్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఉదయం పది గంటలకు నేరుగా రావొచ్చన్నారు. కొప్పెర్లలో ఇంగ్లిష్, గణితం, తెలుగు లెక్చరర్ ఖాళీలు, హిందీ టీజీటీ, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పాలకొండలో ఎకనామిక్స్, బొడ్డవలసలో ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి కేవలం పురుష అభ్యర్థులే అర్హులన్నారు. వేపాడలో ఫిజిక్స్ లెక్చరర్, రెండు పోస్టులు గణితం, సోషల్ ఒక పోస్టు పీజీటీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ టీజీటీలు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వియ్యంపేటలో గణితం లెక్చరర్, పీజీటీ గణితం, వంగరలో గణితం, జూవాలజీ లెక్చరర్ పోస్టులు, నెల్లిమర్లలో టీజీటీ హిందీ, భామినిలో ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు కేవలం బీఎడ్, పీజీ, టెట్ పూర్తయిన మహిళా అభ్యర్థులు మాత్రమే హాజరవ్వాలన్నారు. పీడీ పోస్టుకు బీపీఎడ్‌తో పాటు పీజీ లేదా ఎంపీఎడ్ అర్హత, ఆరోగ్య సూపర్‌వైజర్‌పోస్టుకు జీఎన్ఎం అర్హత కలిగి ఉండాలని వెల్లడించారు. ఇతర వివరాలకు విజయనగరంలో కో ఆర్డినేటర్ కార్యాలయం లేదా గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.

మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా



నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్ల తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు. లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్టు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్య, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

పదేళ్లు అధికారమిస్తే హైదరాబాద్ స్థాయికి అమరావతి

● ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

జామి: మరో పదేళ్ల పాటు కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటే మన అమరావతి.. హైదరాబాద్ స్థాయికి చేరుకుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం లొట్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకుడు కాకర్లపాటి శ్రీనురాజు ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి, పాల అభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ యువత తాము ఉన్న చోటే ఉద్యోగాలు కావాలని కోరుకుంటున్నారని, అది చాలా తప్పు అన్నారు. ఏదో ఒక రంగంలో శిక్షణ పొందితే అందులో రాణించి ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. యువత శిక్షణ పొందిన రంగంలో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం చంద్రబాబునాయుడే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలరని గట్టిగా నమ్మి కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ ఐదేళ్లలో లొట్లపల్లి గ్రామం నుంచి యువతను అధిక సంఖ్యలో ఉద్యోగులుగా చూడాలనే తన కోరికను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి.స్వామినాయుడు, లగుడు రవికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, మండల పార్టీ కార్యదర్శి వర్రి రమణ, మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, జనసేన నేతలు సురేష్, రవికుమార్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, టీడీపీ మహిళా విభాగం నేతలు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, సూరెడ్డి రూప్సీలక్ష్మి, కొత్తలి సూర్యారావు, పైడిరాజు, చందక ఎర్నాయుడు, గోపి, జనసేన మండల అధ్యక్షుడు పీవీఆర్ వర్మరాజు, నాయకులు జన్నెల బాలకృష్ణ, ముగడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

గజపతినగరం: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి జాడలేక నియోజకవర్గం ఎంతో వెనుకబడిపోయిందన్నారు. అధికారులు అభివృద్ధి పనులపై ప్రణాళికలను సిద్ధం చేసి అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులకు గత ప్రభుత్వం తట్ట మట్టి కూడా వేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారని అన్నారు. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు హయాంలో పోలవరం పనులు చేసి చివరి ఎకరాకు సాగు నీరు అందించే దిశగా పనులు చేపడతామని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వంతో పాటు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, దత్తిరాజేరు మండల పార్టీ నాయకులు చప్పా చంద్రశేఖర్, నాయకులు శీరం రెడ్డిరామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

సీజనల్ వ్యాధులపై అవగాహన

బాడంగి, జూలై 13: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి అన్నారు. శనివారం మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో గ్రామంలో అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులపై గ్రామ స్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను రోడ్లపై పారవేయకుండా చెత్తడబ్బాల్లో వేయాలన్నారు. మురుగునీరు కాలువల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే కాలువల్లో పూడికతీతలు, తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ వంటి చర్యలు అధికారులు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

జడ్పీ తీర్మానం అభినందనీయం

విజయనగరం దాసన్నపేట: విశాఖపట్టణం రహదారి జొన్నాడ గ్రామం వద్ద నిర్మించిన టోల్‌గేట్‌ను వేరే చోటుకు తరలించాలని కోరుతూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించడం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ నాయకులు అల్లం నాగభూషణం అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే టోల్‌గేట్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాజారావు, పీఎల్ఎన్ రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను ఉపయోగించుకోండి

లక్కవరపుకోట: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి కే.గాయత్రి కోరారు. శనివారం ఖాసాపేట గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు, చాప్ కట్టర్లను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అదే విధంగా పశువుల్లో వచ్చు సీజనల్ వ్యాధులపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సహాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

విజయనగరం రూరల్: జిల్లా స్థాయి టైక్వాండో పోటీలు ఆదివారం ఉదయం 10 గంటలకు తోటపాలెం గాయిత్రీ స్కూల్ ఆవరణలో జరుగుతాయని జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభిస్తారని తెలిపారు.

మినీ గోకులాల బిల్లులు చెల్లించండి


డిమాండ్ చేస్తున్న రైతులు

వేపాడ: టీడీపీ ప్రభుత్వం 2014-2019 మధ్య కాలంలో మినీ గోకులాల షెడ్లు మంజూరు చేసింది. వీటిని నిర్మించిన తరువాత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేసిందని.. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అప్పటి పశువైద్యాధికారులు చెప్పిన కొలతల మేరకు షెడ్లు నిర్మించుకున్న సంగతి తెలిసిందే. సకాలంలో నిర్మాణాలను పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని చెప్పిన అధికారులు మాట నిలుపుకోలేదని అంటున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ పాలకులు మినీ గోకులాల షెడ్లకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం కొండగంగుబూడి పంచాయితీ పరిధిలోని రైతులు ఏపీ రైతు సంఘం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. బిల్లులను తక్షణమే చెల్లించి తమను ఆదుకోవాలని.. లేదంటే ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు.

అశ్రునయనాలతో సైనికునికి అంతిమ వీడ్కోలు

● సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

బాడంగి/బొబ్బిలి: లడఖ్‌లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో గురువారం అశువులుబాసిన సైనికుడు గొట్లాపు శంకరరావు భౌతిక కాయాన్ని ప్రత్యేక విమానంలో శనివారం గ్రామానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. విశాఖ సైనికాధికారి కల్ పాండే, కాకినాడ సైనిక సంక్షేమ అధికారి ఎం.కృష్ణారావు, భానుప్రసాద్, విశాఖ నేవీ అధికారి ఎంసీపీవో అభిలాష్, ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ సుబేదార్ చంద్రశేఖర్, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, బాడంగి ఎస్ఐ జయంతి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, తహసీల్దారు రాజారావు, మండల టీడీపీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, బొబ్బిలికి చెందిన మాజీ సైనికోద్యోగుల సంఘ నాయకులు రేవెళ్ల కిరణ్ కుమార్, రెడ్డి దామోదరరావు తదితరులు నివాళులు అర్పించారు. వర్షాన్ని లెక్క చేయకుండా మాజీ ఆర్మీ ఉద్యోగులంతా బొబ్బిలి నుంచి బైకులపై ర్యాలీగా బొత్సవానివలస గ్రామానికి చేరుకున్నారు. శంకర్‌కు తల్లిదండ్రులతో పాటు భార్య కోమలత, పిల్లలు దివ్యాన్షిక(9), జయంత్‌నాయుడు (7) ఉన్నారు. శంకరరావు ఉదంతాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే బేబీనాయన చెప్పారు. అతని భార్య కోమలతకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


నివాళి అర్పిస్తున్న బేబీనాయన

భూములను సాగుదారులకే అప్పగించాలి

బొబ్బిలి: దేవదాయ శాఖకు చెందిన భూములను పూర్వకాలం నుంచి సాగు చేసుకుంటున్న రైతులకే అప్పగించాలని జిల్లా కౌలు రైతు సంఘ కార్యదర్శి రాకోటి రాములు, అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. పాతబొబ్బిలి, గొల్లపల్లి గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న దేవాదాయ భూములను శనివారం వారు పరిశీలించారు. దేవదాయ శాఖ భూములపై సాగు చేసుకుంటున్న రైతుల కుటుంబాలకే హక్కు కల్పించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అయినప్పటికీ అధికారులు ఇందుకు విరుద్ధంగా బహిరంగ వేలం నిర్వహించి ఎక్కువ కౌలు చెల్లిస్తున్న వారికి సాగుహక్కులు కల్పించడం అన్యాయమన్నారు.


పాతబొబ్బిలిలో దేవదాయ భూములను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట



మాట్లాడుతున్న జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ

బొబ్బిలి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరుబాటలోనే సీపీఐ ఉంటుందని జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో శనివారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి తన బలాన్ని పుంజుకున్నట్లుగా నిరూపించుకుందన్నారు. దేశసంపదను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతూ దేశంలో మతోన్మాద శక్తులకు అండగా మోదీ పాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, ఏరియా కార్యదర్శి కండాపు ప్రసాదరావు, నాయకులు కోట అప్పన్న, నాగభూషణ్, మునకాల శ్రీనివాసరావు, తాడంగి ఎండుదొర, హమాలీస్ జిల్లా అధ్యక్షుడు ముల్లు నర్సింహులు, గోపి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా భూములు ఇప్పించండి

● ఎమ్మెల్సీ రఘురాజుకు జిందాల్ నిర్వాసితుల వినతి

శృంగవరపుకోట రూరల్: గడిచిన 15ఏళ్లుగా తాము జిందాల్‌కు ఇచ్చిన భూముల్లో పరిశ్రమ వస్తుందని.. తమ పిల్లల జీవితాలు బాగుపడతాయని ఎంతో ఎదురు చూస్తే... నిరాశే మిగిలిందని.. కొన్ని విషయాల్లో తమను కంపెనీ యాజమాన్యం మోసం చేసిందని నిర్వాసితులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వద్ద ఆరోపించారు. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. శనివారం ఉదయం బొడ్డవరకు వెళ్లిన నిర్వాసితులు ఎమ్మెల్సీ రఘురాజును కలిశారు. వారు మాట్లాడుతూ 2008లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి మాటలు నమ్మి ఘోరంగా నష్టపోయామన్నారు. డీపట్టా భూములకు కేవలం రూ.రెండు లక్షల నగదు, రూ.రెండు లక్షల షేర్ ధనం, జిరాయితీ భూములకు రూ.6లక్షల నగదు, రూ.6లక్షల షేర్ ధనం ఇస్తామంటే ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని.. భూములు ఇచ్చిన రైతులకు ఒక్కమాట కూడా చెప్పకపోవడం బాధ కలిగించిందని చెప్పారు. దీనిపై రఘురాజు స్పందిస్తూ ఈ విషయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వివరించామని చెప్పారు. ప్రభుత్వం, సంస్థ ప్రతినిధులు, నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. నిర్వాసితుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టిలో పెడతామని చెప్పారు.


రఘురాజుకు వినతిపత్రం ఇస్తున్న జిందాల్ నిర్వాసితులు

మాతృసంస్థకు పంపించాలని బిల్లు కలెక్టర్ల వినతి

బొబ్బిలి: సచివాలయ వ్యవస్థ నుంచి తామందరినీ మాతృసంస్థలకు తిరిగి పంపించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ బిల్లు కలెక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు జీఎం ఖాన్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు శనివారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీ నాయనను కలుసుకొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, చైన్‌మ్యాన్లు తదితరులను రాష్ట్రవ్యాప్తంగా సుమారు పది వేల మందిని గత ప్రభుత్వం వార్డు కార్యదర్శులుగా నియమించిందన్నారు. దీనితో తమ పదోన్నతులకు సంబంధించి అనేక సమస్యలు తలెత్తి ఎంతో నష్టం జరిగిందన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్వీసు రూల్స్ నుంచి తమకు విముక్తి కలిగించి అందరినీ మాతృసంస్థలకు తిరిగి పంపించాలని ఖాన్ కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బేబీనాయన వారికి హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేస్తున్న బిల్లు కలెక్టర్లు

కుక్కల దాడిలో 15 మేక పిల్లలు మృతి


మృతిచెందిన మేక పిల్లలు

రాజాం, జూలై 13: వీధి కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పురపాలక సంఘం పరిధిలోని మల్లయ్యపేట కాలనీకి చెందిన కోడిబోయిన నగేష్ తన మేకపిల్లలను గ్రామంలో ఒక చోట పెట్టి ఉంచాడు. శనివారం వేకువజామున వీధి కుక్కలు దాడి చేయడంతో 15 మేకపిల్లలు మృత్యువాత పడ్డాయి. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని నగేష్ కోరాడు. పురపాలక సంఘం అధికారులు చర్యలు తీసుకుని కుక్కలను కట్టడి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

చీపురుపల్లి, జూలై 13: చీపురుపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి టి.రమేష్ అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు, రైల్వే పోలీసుల సమాచారం ప్రకారం, మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన రమేష్ కుటుంబం కొంత కాలం కిందట, పట్టణంలోని మెట్ట కాలనీకి వచ్చి స్థిరపడింది. ఓ ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్న రమేష్‌కు గతేడాది పెళ్లయ్యింది. ఈ క్రమంలో శనివారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు కింద రమేష్ పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే ప్రమాదవశాత్తూ రైలు కింద పడిపోయాడా, లేదా ఆత్మహత్యకు ప్రయత్నించాడా అనేది తేలాల్సి ఉంది. మెరుగైన చికిత్స కోసం రమేష్ ను విజయనగరం తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి..

చీపురుపల్లి, జూలై 13: పట్టణంలోని మెయిన్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండా రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. మెయిన్ రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళ్తున్న రాకేష్ బజాజ్ షో రూం సమీపంలో కుక్కను ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో రాకేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స కోసం రాకేష్‌ను విజయనగరం తరలించారు. ఎస్సై కె. కిరణ్‌కుమార్‌నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లిమర్లలో కారుపై దాడి

నెల్లిమర్ల, జూలై 13: నెల్లిమర్లలో ఓ కారుపై రాయితో దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన సూర్యారావు కుటుంబంతో కలిసి కారులో చీపురుపల్లి మండలం లోని తమ బంధువుల ఇంటికి శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో వెళ్త న్నాడు. ఈ సమయంలో నెల్లిమర్లలోని ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్‌లోకి వచ్చేసరికి ఓ వ్యక్తి అడ్డగించి 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, అందుకు తా ము వ్యతిరేకించడంతో కారుపై రాయితో దాడికి పాల్పడ్డాడని దీంతో కారు అద్దాలు పగిలిపోయాయని బాధితుడు తెలిపారు. అయితే వెంటనే అతని నుంచి తప్పించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయామని వాపోయడు. దీనిపై శనివారం ఉదయం నెల్లిమర్ల పోలీసుల దృష్టికి తీసుకురావడంతో పోలీసులు విచారణ జరిపి స్థానిక రెల్లివీధికి చెందిన పైడిరాజు అనే మతిస్థిమితం లేని వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా సూర్యారావు బంధువు, గుర్లకు చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి శనివారం రాత్రి నెల్లిమర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బంధువులు కారులో వెళ్తుండగా ఒక వ్యక్తి కారును ఆపి, రూ.20వేలు డిమాండ్ చేయడంతో పాటు సూర్యారావు జేబులో నుంచి వెయ్యి రూపాయాలు లాక్కొని పారిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. నెల్లిమర్ల ఎస్ఐ ఎస్.రామ్‌గణేష్ కేసు నమోదు చేశారు.

అర్హులకు పథకాలు అందించండి

విజయనగరం దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకం కింద రిజిస్టర్ చేసుకున్న అర్హులైన వారికి వెంటనే సాయం అందించాలని బీజేపీ విశ్వకర్మ యోజన కన్వీనర్ కుప్పిలి మోహనా చారి, నాయకులు ఇమంది సుధీర్‌లు కోరారు. శనివారం డీఆర్‌ఓ అనితను కలిసి వినతి పత్రం అందించారు. డీఆర్‌వోను కలిసిన వారిలో బీజేపీ నాయకులు సురేష్, పైడిరాజు, దేవుడు, సోము మహేష్, రాజకుమార్ హీరావత్, గిరిష్‌కుమార్ తదితరులు ఉన్నారు.


డీఆర్వోకి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఇంకా 'రైతు భరోసా కేంద్రాలే'

జామి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా కేంద్రాలను రైతు సేవ కేంద్రాలు'గా మార్చామని చెబుతున్నారు. కానీ వీటిపై ఇంకా రైతుభరోసా కేంద్రాలుగానే పేర్లు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మలనే ఇంకా కొనసాగించడం గమనార్హం. దీనిపై మండలంలోని అలమండ టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఆర్‌బీకే ఉద్యోగులను అడిగితే తమకు ఇంకా తొలగించాలని ఎటువంటి ఉత్తర్వులు రాలేదని చెప్పారన్నారు. ఈ విషయంపై ఏవో కిరణ్‌కుమార్ ను వివరణ కోరగా రైతు భరోసా కేంద్రాలను రైతు సేవ కేంద్రాలుగా పిలుస్తున్నారని.. ఈపేర్లు మార్చాలని ఇంకా అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదని చెప్పారు.



పేరుమార్చని, మాజీ ముఖ్యమంత్రి బొమ్మ తీయని అలమండ రైతుభరోసా కేంద్రం

ముమ్మరంగా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక సర్పంచ్‌లు, అధికారులు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ రాకుండా కాలువల్లో పూడికలు తీసి, బ్లీచింగ్ చల్లారు. అటు సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లు, మంచినీటి బావులలో క్లోరినేషన్ చేశారు.

చంద్రబాబుతోనే బీసీలకు ఆదరణ

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు

విజయనగరం: చంద్రబాబుతోనే బీసీలకు సాధికారత, ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు అన్నారు. ఉత్తరాంధ్ర బీసీ, వెనుకబడిన కులాలు, రజక సంఘాల ఆధ్వర్యంలో శనివారం జడ్పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సుమారు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందే తప్ప, ఎవరికీ న్యాయం చేయ్యలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలు, అనుబంధ కులాలకు ఉపయోగపడే వస్తువులను, సబ్సీడీపై ఆదరణ పథకం ద్వారా అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. వైసీపీ వచ్చిన తరువాత ఆదరణ పథకం జాడ లేదన్నారు. రానున్న రోజుల్లో రూ.50 కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ కోసం నిధులు కేటాయించనున్నట్లు రామారావు తెలిపారు. ముందుగా బీసీ సంఘాలు ఆయనను ఘనంగా సన్మానించాయి. రాష్ట్ర రజక సంఘ అధ్యక్షురాలు ఎలిగాపు విజయలక్ష్మి, ప్రతినిధులు కేశవపట్టణం చంద్రిక, చిలకపల్లి శ్రీనివాసరావు, గణపతి తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

● ప్రతులను దహనం చేసిన యూటీఎఫ్

విజయనగరం దాసన్నపేట, జూలై 13: రాష్ట్రంలో గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో తీసుకువచ్చిన జీపీఎస్ గజిట్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌చంద్రపట్నాయక్, ఈశ్వరరావులు డిమాండ్ చేశారు. శనివారం జీఓ నెంబరు 57ని రద్దు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసి, గజిట్ కాపీలను మంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం జీఓ నెం 54ను తీసుకువచ్చి, జీపీఎస్‌ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సేవలకు గుర్తించినా, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో యుటీఎఫ్ నాయకులు రాము, శ్రీనివాసరావు, ప్రసాదరావు, తిరుపతినాయుడు, సత్యనారాయణ, రాజారావు, రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక గాంధీవిగ్రహం ముందు గెజిట్ ప్రతులన దహనం చేశారు. ఆ సంఘం రాష్ట్రనేత కె.విజయగౌరి మాట్లాడుతూ జీపీఎస్ అమలు కోసం గజిట్ పబ్లికేషన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ముమ్మాటికీ ఉద్యోగులను మోసగించడమేనన్నారు. ఈ రాజపత్రాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, సుధాకర్, మహేశ్, వరప్రసాద్, స్వామినాయుడు ఉన్నారు.


విజయనగరంలో..


బొబ్బిలిలో..

జీవో-54ను రద్దు చేయాలి

● యూటీఎఫ్ డిమాండ్ ● గెజిట్ నోటిఫికేషన్ ప్రతుల దహనం



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: జీవో-54ను రద్దుచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా యూటీఎఫ్‌శాఖ డిమాండ్‌చేసింది. ఈమేరకు శనివారం పార్వతీపురంకలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆ జీవో గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దహనంచేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు తదితరులు మాట్లాడుతూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి సీపీఎస్‌ను రద్దుచేసి ఎవరికి ఆమోదం యోగ్యంకాని సీపీఎస్‌ను ఆర్డినెన్స్ ద్వారా దొంగత నంగా జీవో-54 ద్వారా అమలు చేశారని తెలిపారు. గత నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజున ఈ ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఖండించారు. పాత తేదీతో గత ఏడాది అక్టో బరు 20 నుంచి జీపీఎస్‌ను అమలు అమలు చేయడానికి ఓడిపో యిన ప్రభుత్వంలో పనిచే సిన ఆర్థికకార్యదర్శి ఎస్ఎస్‌రావత్‌కు అధికారం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు జీవో-54ను రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్, జిల్లా కార్యదర్శులు కె.మురళి, ఎన్. శ్రీను, వి.జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోనుబాయి వైద్యాధికారికి సంఘీభావం

● నల్లబ్యాడ్జీలు ధరించాలని పీహెచ్‌సీల అసోసియేషన్ పిలుపు

సీతంపేట: దోనుబాయి వైద్యాధికారి భాను ప్రతాప్‌కు జిల్లా వైద్యులు, ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీల వైద్యుల సంఘం పిలుపు మేరకు శనివారం వైద్య అధికారులు డ్యూటీలో ఉన్న సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలియజేశారు. ఈ మేరకు ఆయనకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల అసోసియేషన్ నాయకుడు డాక్టర్ రవీందర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ పీహెచ్‌సీలో కొంతమంది సిబ్బంది ఓ వ్యక్తితో కలిసి భానుప్రతాప్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని, ఈ సమస్య పరిష్కారయ్యే వరకు నల్లబ్యాడ్జీలు ధరించాలని నిర్ణయించారు. ఓ వ్యక్తి డబ్బు వసూలు చేయడానికి వేధింపులకు గురిచేస్తూ సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తుండడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని వైద్యులు భానుప్రతాప్‌కు మద్దతు తెలియజేసేందుకు పాలకొండ ఎస్‌డీపీవో కార్యాలయానికి తరలివచ్చారు. నిరాధారమైన ఆరోపణలను ఖండించారు. డాక్టర్ భాను ప్రతాప్‌కు వైద్య సంఘం అండగా ఉంటుందని తెలిపారు. వైద్యాధికారులపై తప్పుడు ఆరోపణలపై అండగా ఉండి వైద్యులు సమగ్రత, గౌరవాన్ని కాపాడుకుంటామని పేర్కొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్య తీసుకోండి

● పార్వతీపురం పట్టణ సీపీఎం కమిటీ సభ్యులు


బిల్లబందను పరిశీలిస్తున్న సీపీఎం కమిటీ సభ్యులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలో అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జీవీరమణ, కమిటీసభ్యులు పి.సన్యాసిరావు కోరారు.ఈ మేరకు శనివారం పట్టణంలోని అనధికార లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని బిల్ల బందను కప్పి లేఅవుట్ వేస్తున్నా అధికారులు చోద్యంచూస్తున్నారని ఆరోపించారు.ప్రజాప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారులకు బందల ఆకమణలపై హెచ్చరికలు జారీచేసిన పట్టించుకోవడం లేదన్నారు. బిల్లబంద, గోపసాగరం పరిధిలో ప్రభుత్వ భూమిని పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ శాఖలు స్వాధీనం చేసుకోక పోతే త్వరలో ఉద్యమ ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ


సూర్యనారాయణతో మాట్లాడుతున్న సంధ్యారాణి

పాచిపెంట: మండలంలోని మాతుమూరులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముఖిసూర్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండడంతో శనివారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, మిర్తివలస సర్పంచ్ కొత్తల సత్యవతి, నాయకులు కొత్తల పోలినాయుడు, పూసర్ల నరసింగరావు, దత్తి పైడిపునాయుడు ఉన్నారు.

వాహనాలకు పత్రాలు తప్పనిసరి


ద్విచక్రవాహనం తనిఖీచేస్తున్న పోలీసులు

మక్కువ: వాహనచోదకులు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. శనివారం స్థానిక మెయిన్ రోడ్డు జంక్షన్‌లో వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. ఆటోల్లో పరిమితిమికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గంగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరకు రైతులకు అవగాహన

సీతానగరం:మండలంలోని కామందరవలసలో సంకిలి ఈఐడీ ప్యారీ లిమిటెడ్ షుగర్ ఫ్యాక్టరీ శనివారం బొబ్బిలి జోన్ చెరకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించింది. ఈసందర్భంగా ఫ్యాక్టరీ ఏవోపీ పట్టాభిరామరెడ్డి చెరకు సాగులో మెలకువలు, అధిక దిగుబడులు ఇచ్చే కొత్త రకాలు గురించి వివరించారు. సదస్సులో ఆర్అండ్‌డీ హెడ్, షణ్ముఖ సుందరం కేన్ మేనేజర్ రాజేంద్రన్ డీజీఎం రమేష్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గురండి సమీపంలో గుంత పూడ్చివేత


యంత్రంతో గుంతను పూడ్చుతున్న దృశ్యం

భామిని: గురండి సమీపంలో ఏర్పడిన గుంత వల్ల ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతుండడంతో బత్తిలి నాయకులు పూడ్చేందుకు ముందుకువచ్చారు. గురండి సమీపంలో గుంత వద్ద ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో బత్తిలి ఎస్ఐ సీహెచ్‌ప్రసాద్ గుంతవైపు వాహనాలు వెళ్లకుండా శనివారం బారిగేడ్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను విడిచిపెట్టారు. ఈనేపథ్యంలో బత్తిలి నాయకులు డస్ట్,చిప్స్ తెప్పించి యంత్రాలతో గుంత పూడ్చారు. ఈ మేరకు బత్తిలి యువత సుధాకర్,కిరణ్‌కుమార్, ఆర్.అశోక్,శ్రీనివాసరావుతోపాటుపలువురు పాల్గొని సహకరించారు.

మలేరియాపై చర్యలు తీసుకోండి

ఒడిశా

● రాయగడ కలెక్టర్ మనోజ్ సత్యవాన్ వహాజన్

రాయగడ:జిల్లాలో విజృంభిస్తున్న మలేరియా జ్వరాలపై చర్యలు తీసుకోవాలని రాయగడ కలెక్టర్ మనోజ్‌సత్యవాన్ వహాజన్ వైద్యశాఖాధికారులను కోరారు. ఈ మేరకు రాయగడలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,71,216 మందికి పరీక్షలు నిర్వహించగా 3,712 మలేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు.చంద్రపూర్ సమితిలో అత్యధికంగా కేసులు నమోదు కావడంతో వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు.జిల్లాముఖ్యవైద్యాధికారి లాల్‌మోహన్‌రౌత్రాయ్ మాట్లాడుతూ మలేరియా జ్వరాలు, డెంగూవ్యాధిపై అవగాహనకార్యక్రమాలు ప్రారంభించామని తెలిపా రు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా పరీక్షా కిట్లు, మందులు అందుబాటులో ఉంచామని చీఫ్ మెడికల్ ఆఫీసర్ పేర్కొన్నారు.

బలరామావతారంలో జగన్నాథుడు



రాయగడ: రాయగడలో జగన్నాథుడు రథయాత్ర ఉత్సవం ఏడో రోజు గుండిచా మందిరంలో రామ,బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా భక్తులు తరలివచ్చారు. ముందురోజు సాయంత్రం పరశురామావతారంలో దర్శనమిచ్చారు.

పనులు కాక.. తాగు నీరందక

● నిలిచిపోయిన జల్‌జీవన్ పనులు ● కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశలు ● ఇదీ వీరఘట్టం మండలంలో పరిస్థితి


గడగమ్మలో వాహనంలో తీసుకొచ్చిన మంచినీటి ట్యాంక్ వద్ద నీటిని కొనుగోలుచేస్తున్న మహిళ

వీరఘట్టం:మండలంలో జలజీవన్‌మిషన్ కింద ప్రారంభించిన పనులు పూర్తికా కపోవడంతో ప్రజలు తాగునీటికి అవస్థలకు గురవుతున్నారు. ఏడాది కిందట వైసీపీ ప్రభుత్వం హయాంలో పనులు ప్రారంభించారు. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం, పనులు చేసినా బిల్లులు అవుతాయని నమ్మకం లేక కాంట్రాక్టర్లు ముందుకురాకపోవడం వెరసి పనులు ముందుకుసాగలేదు. దీంతో అర్థాంతరంగా పలు చోట్ల పనులు నిలిచిపోయాయి. కేంద్ర ప్రాయోజిత జేజేఎం మిషన్ కింద తాగునీటి కొళాయిలు ఏర్పాటుచేయనున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతో తాగునీటి కష్టాలు తీరుతాయని పలు గ్రామాల ప్రజలు ఆశించారు.నేటికీ పనులు పూర్తికాకపోవడంతో ఇప్పటివరకూ చేపట్టిన నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా పలు గ్రామాల్లో వర్షాకాలం లోనూ నీటికష్టాలు తప్పడంలేదు. బురద నీటిని తాగాల్సి వస్తోం దని మహిళలు వాపోతున్నారు. గడగ మ్మ, బూరుగ, విక్రంపురం, నడుకూరు తదితర గ్రామాల్లో నిత్యం తాగునీటికి అగచాట్లు తప్పడంలేదు. దీంతో గ్రామాల్లోని ప్రజలు ప్రైవేటు మంచినీటి ట్యాంకుల నిర్వాహకుల నుంచి నీటిని కొనుగోలు చేసి గొంతును తడుపుకొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం, ఆపై వ్యాధులు విజృంభిస్తుండడంతో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జేజేఎం పనులు పూర్తిచేసి తాగునీరందిస్తుందని పలు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.


బూరుగలో అర్థాంతరంగా నిలిచిన జలజీవన్‌మిషన్ పనులు

అనుమతి వచ్చిన వెంటనే పనులు చేస్తాం: జేఈ

పనులు నిర్వహించే కాంట్రాక్టర్లు గడువు పూర్తికావడంతో రెన్యువల్‌కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వి.ప్రవల్లిక తెలిపారు.రెన్యువల్‌కు అనుమతివచ్చిన వెంటనే పనులుచేపడతామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో రథయాత్ర ఉత్సవాలు

● రామావతరంలో జగన్నాథుడి దర్శనం

జిల్లాలో భక్తి శ్రద్ధలతో రథయాత్ర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం జగన్నాథుడు రామావతరంలో దర్శనమిచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుండా ఆలయాల అధికారులు ఏర్పాట్లుచేశారు. ఈ సందర్భంగా పరిసరాల ప్రాంతాల భక్తులు జగన్నాథుడిని దర్శించుకున్నారు.

●**పార్వతీపురంటౌన్:**పార్వతీపురంలోని జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా గుండిచామందిరంలో శనివారం జగన్నాథుడుభక్తులకు రామా వతారంలో దర్శనమిచ్చారు.ఉదయం ఎనిమిది నుంచి రాత్రిఎనిమిది గంటల వరకు ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●**పాలకొండ:**పట్టణంలోని జగన్నాథస్వామి రథోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.స్వామివారు రామ, బలరాం అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రధాన అర్చకులు మఠం విశ్వనాథదాస్ భక్తులతో పూజలు చేయించారు. ఆలయ ఈవో సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో బారిగేడ్ల ద్వారా భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతి ఇచ్చారు.

●**సాలూరు:** పట్టణంలో గుండిచా మందిరంలో ఉన్న జగన్నాథుడు రామ బలరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


పార్వతీపురంటౌన్: రామావతారంలో..


పాలకొండ: రామబలరాం అవతారంలో..


సాలూరులో..

మలేరియాపై దృష్టి సారించండి

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ


ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట:మన్యంలో మలేరియాజ్వరాలతో గిరిజనులు బాధపడుతుండడంతో నివారణకువైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టంచేశారు. శనివారం స్థానిక ఏరియాఆసుపత్రిని సందర్శించి,రోగులకు ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగి స్థానికంగానే వైద్యం అందించే విధంగా వైద్యాధికారులు దృష్టిసారించాలని తెలిపారు.ప్రస్తుతం మలేరియా వైరల్ జ్వరాలు అధికంగా ఉండడం వల్ల రోగులకు అసౌకర్యం కలగకుండా అన్ని మందులు అందుబాటులో ఉండాలని, అవసరమైతే తాను అధికారులకు సంప్రదించి మందులు అందుబాటులో ఉంచే విధంగా దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిమరిక పవన్, ప్రసాద్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలలకే ఇవ్వాలి

సాలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం వర్తించేలా నిబంధన విధించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది, లక్షలాది రూపాయలను వెచ్చించి చదివించే విద్యార్థులకు ఈ పథకం వర్తింపజేయవద్దని తెలిపారు. జీవో -117 రద్దుచేయాలని, జీవో -3ను పునరుద్ధరించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. పీఆర్సీ వెంటనే ప్రకటించాలని తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పాత బకాయిలను విడుదల చేయాలని పేర్కొన్నారు.

జనసేన నాయకుల ఆర్థిక సాయం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 12వ వార్డు గంటా వీధికి చెందిన జనసేన నాయకుడు బెహరా సురేష్ ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఆ పార్టీ నాయకులు అండగా నిలిచారు. ఈ మేరకు రూ.15 వేలు పట్టణ జనసేన నాయకులు రెడ్డి నాగరాజు, వాహబ్‌లు, చందక అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం సురేష్ భార్య తులసి, ఇద్దరు పిల్లలకు అందజేశారు.

కొమరాడలో కుండపోత వర్షం


కొమరాడలో కురుస్తున్న వర్షం

కొమరాడ: కొమరాడ తదితరగ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మెట్ట వ్యవసాయానికి కూడా ఈ వర్షం అనుకూలంగా ఉందని రైతులు తెలిపారు.


లారీని యంత్రం సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం



అంతర్రాష్ట్ర రహదారిపై నిలిచిపోయిన భారీ వాహనాలు

15 గంటలు అగచాట్లు

● గోతిలో దిగబడిన లారీ బయటకు తీత

● అంతర్రాష్ట్ర రహదారిపై రెండు కిలోమీటర్లు స్తంభించిన ట్రాఫిక్

కొమరాడ: కొమరాడ వద్ద పార్వతీపురం-కూనేరు అంతర్రాష్ట్ర రహదారిపై దిగబడిన లారీని అతికష్టం మీద స్థానికులు, లారీ నిర్వాహకుడు శనివారం బయటకుతీశారు. దీంతో వాహనచోదకులు, లారీడ్రైవర్లు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారంరాత్రి కొమరాడ వద్ద లారీ దిగబడిపోయింది. ఫాల్స్ రాయిని లారీల్లో తీసుకొచ్చి యంత్రాల సహాయంతో గోతుల్లో నిం పారు. దీంతో 15 గంటలపాటు వాహనచోదకులు అగచాట్లకు గురయ్యారు. శనివారం ఉదయం గోతిలో నుంచి లారీ తీయడంతో నిలిచిపోయిన వాహనాలు ముందుకు కదిలాయ.

అమ్మో.. అంతర్రాష్ట్ర రహదారి

పార్వతీపురం-కూనేరు అంతర్ రాష్ట రహదారిపై నిత్యం వాహనాలు దిగబడుతున్న విషయం విదితమే.ఒడిశా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఇది ప్రధాన రహదారిగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈనేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం కనీసనిర్వహణ పనులు చేయకపోవడంతో అడుగడుగనా పెద్దపెద్ద గోతులు ఏర్పడాయి. ఈమార్గంలో వచ్చే వాహనాలు నిత్యం ఏదోఒకచోట గుంతల్లో దిగబడుతుండడంతోపాటు కొందరు ప్రమాదాల బారినపడుతున్నారు. దీంతో పార్వతీపురం- కూనేరు అంతర్రాష్ట్ర రహదారి ప్రయాణ మంటే లారీ డ్రైవర్లు భయపడుతున్నారు. ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు సరకు పంపిస్తే ఎప్పుడికి చేరుతుందోనని యజమానులు ఆం దోళన చెందుతు న్నారు. అంతే కాకుండా అత్యవసర పనులపై వెళ్లే వారంతా సకాలంలో చేరుతోమోలేదోనని గుబులు చెందుతున్నారు. పార్వతీపురం- కూనేరు రహదారి నాలుగు రాష్ట్రాలకు ప్రధాన రహదారికావడంతో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు.

రహదారికి మరమ్మతులు చేయాలి



ఈ రహదారి గుండా ప్రయాణం కష్టంగా ఉంది. నిత్యం ఈ రహదారిలో ఎక్కడో ఒక చోట ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నేళ్లుగా రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇబ్బందిపడుతున్నాం. తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలి.

- పి.శంకర్, లారీ డ్రైవర్, విశాఖపట్నం

సొమ్మసిల్లిన అంగన్‌వాడీ కార్యకర్త

● వేధింపులపై మంత్రి సంధ్యారాణికి వినతి


సొమ్మసిల్లిన విజయలక్ష్మి పరిస్థితిని పరిశీలిస్తున్న సంధ్యారాణి

సాలూరు: సాలూరులోని మంత్రి సంధ్యారాణి ఇంటి వద్దకు తమ సమస్యలు తెలియజేసేందుకు శనివారం వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తల్లో ఒకరు సొమ్మసిల్లి పడిపోయారు. అప్రమత్తమైన మంత్రి సిబ్బంది ఆమెకు సపర్యాలు చేశారు. నిత్యం ఉన్నతాధికారులు వస్తే తమ నుంచి ప్రతినెలా డబ్బులు వసూలు చేస్తూ తమను నిత్యం ఓ అంగన్‌వాడీకార్యకర్త ఇబ్బందులకు ఓ గురి చేస్తోందని ఆమె నుంచి తమకు రక్షణకల్పించాలని పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తున్న కె.భారతి,ఎం.విజయలక్ష్మి సంధ్యారాణి వద్ద కన్నీంటిపర్యాంతమయ్యారు. ఆ సమ యంలో మంత్రి ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా అంగన్‌వాడీ కార్యకర్త విజ యలక్ష్మి సొమ్మసిల్లిపడిపోయారు.దీంతోఅప్రమత్తమైన మంత్రిసిబ్బంది సపర్యాలు చేశారు. వెంటనే ఆమెవద్దకు మంత్రిరావడంతో విల పించింది. తనను ఓ అంగన్ వాడీ కార్యకర్త నిత్యం వేధిస్తోందని, ప్రతినెలా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తోందని, ఇవ్వకపోతే బెదిరిస్తోందని విజయలక్ష్మి మంత్రి వద్ద వాపోయింది. దీంతో కంటిమీద కునుకులేకుండా పోయిందని, అనారోగ్యానికి గురయ్యానని ఆవేదనవ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఎక్కడాఅన్యాయం జరిగినా సహించని తాను తన నియోజకవర్గంలో అన్యాయం జరిగితే ఊరుకొనేది లేదని మంత్రి భరోసాఇచ్చారు. కాగాఓ అంగన్‌వాడీ కార్యకర్తపై పట్టణానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, విజయలక్ష్మి ఎస్ఐ సురేష్‌కు ఫిర్యాదుచేశారు. తమను నిత్యం వేధిస్తోందని, అందరిని వేధించడం ఆమెకు అలవాటుగా మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె నుంచి ప్రాణహాని ఉండడంతో రక్షణ కల్పించాలని కోరారు.

అదుపు తప్పితే అంతే

● పొంచి ఉన్న ప్రమాదం

● ఇదీ తోటపల్లి సమీపంలో మలుపు వద్ద పరిస్థితి

గరుగుబిల్లి: తోటపల్లి సమీపంలోని మలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ వాహనచోదకులు ఏపాటి ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉండడంతో వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. దీనికితోడు రహదారికి ఆనుకుని ఉన్న మట్టి వర్షాలకు కోతకు గురవ డంతో మరింతగా ప్రమాదం మారింది. ఇక్కడ ఏ మాత్రం అదుపు తప్పినా తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాలువలోకి వాహనాలు దూసుకువెళ్తున్నాయి.


ప్రమాదకరంగా తయారైన మలుపు

నేడు విద్యా సదస్సు

గరుగుబిల్లి: పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ గరుగుబిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సన్యాసిరావు, ఎ.ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయఉత్తమ ఉపాధ్యాయుడు, నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు గౌరవార్థం జరిగే కార్యక్రమంలోకళాప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణారావు నిర్వ హణలో జరిగేకార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షులు మర్రాపు మహేష్‌తో పాటు పలువురు హాజరుకానున్నారని తెలిపారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సీతంపేట: సీతంపేటలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించవచ్చని పేర్కొన్నారు.

16 నుంచి పారిశుధ్య వారోత్సవాలు

గరుగుబిల్లి: మండలంలో ఈనెల 16వ తేదీ నుంచి పారిశుధ్య వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ గోపీ గౌరీశంకరరావు తెలిపారు.శనివారం గరుగుబిల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పంచాయతీల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు దోమలు నివారణకు పంచాయతీల్లో డ్రైనేజీ పాటించనున్నట్లు తెలిపారు.

16న భజన నామ సంకీర్తన

వీరఘట్టం: పట్టణంలోని శ్రీశాంతి ఆశ్రమంలో ఈనెల 16, 17 తేదీల్లో శ్రీమలయాళ స్వాముల వారి 62వ పుణ్యారాధన పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 16న సాయంత్రం ఐదుగంటల నుంచి స్వాములవారి చిత్రపటం వద్ద వేద మం త్రాలతో గీతా పారాయణం, భజన నామ సంకీర్తన, మేళతాళాలతో ఊరేగింపు, 17న ఉదయంజ్యోతి ప్రజ్వలనం, విఘ్నేశ్వరపూజ, సద్గురు సు ప్రభాతం, గీతాపారాయణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీకి అభినందన

పాలకొండ:ఎమ్మెల్సీగా ఎన్నికైన పిడుగు హరి ప్రసాద్‌ను పాలకొండ నియోజకవర్గ జనసేన నాయకుడు గర్భాన సత్తిబాబు అభినందిచారు. ఈ సందర్భంగా తోటపల్లి, జంపరకోట రిజర్వాయర్ల ఫైళ్లను ఆయనకు అందజేశారు.

ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడిగా గణపతి


గణపతి

సాలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రాథమికఉపాధ్యాయ సంఘం (ఆప్టా) రాష్ట్రఅధ్యక్షుడిగా ఉమ్మడి విజయనగ రం జిల్లా పారాదికి చెందిన ఏజీఎస్ గణపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన ఆప్టా రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో ఆయన వరుసగా మూడో సారి రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నిక కావడం విశేషం.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

పార్వతీపురంటౌన్: లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఔట్‌పోస్టు పోలీసుల కథనంమేరకు.. శనివారం ఉదయం పట్టణంలోని వివేక్ కాలనీలో నివాసముంటున్న వర్మ తన నివాసంనుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పోస్టుపోసు కూడలి వద్ద విశాఖ పట్నం నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో వర్మకు తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయన్ను జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవల అనంతరం అత్యవసర చికిత్స కోసం విజయనగరం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఔట్ పోస్టు పోలీసులు తెలిపారు.